# మోహన్ బాబు యూనివర్సిటీలో విద్యార్థి ఆత్మహత్య ఘటన పై పీడీఎస్‌యు తీవ్ర ఆందోళన..!!

**పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న**



కడప (స్ఫూర్తి పత్రిక):మార్చి 06 : తిరుపతి జిల్లా చంద్రగిరి మండలంలోని మోహన్ బాబు యూనివర్సిటీలో విద్యార్థి ఆత్మహత్య ఘటన పై పీడీఎస్‌యు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కడప జిల్లాకు చెందిన బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థి హర్షవర్ధన్ రెడ్డి రామిరెడ్డిపల్లిలో అద్దె ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందడం అత్యంత దురదృష్టకరమని పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న పేర్కొన్నారు. కడప నగరంలోని పీడీఎస్‌యు రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల మోహన్ బాబు యూనివర్సిటీలో వరుసగా విద్యార్థుల ఆత్మహత్యలు చోటుచేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. విద్యార్థుల భద్రతను కాపాడాల్సిన యూనివర్సిటీ యాజమాన్యం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉన్నతస్థాయి సమగ్ర విచారణ జరిపి అసలు కారణాలను వెలుగులోకి తేవాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించి న్యాయం చేయాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా యూనివర్సిటీల్లో విద్యార్థులకు భద్రతతో పాటు మానసిక కౌన్సిలింగ్ వ్యవస్థలను బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పీడీఎస్‌యు తరపున ఎం.అంకన్న డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యు జిల్లా నగర నాయకులు మనోజ్,మహేశ్, అఖిల్, పాల్గొన్నారు.

# మైదుకూరు.పట్టణ, హోటల్, బ్రేకరీ, కిరాణా షాప్ యజ మాన్యాలకు హెచ్చరిక..!!

**ఫుడ్ ఇన్స్పెక్టర్ హరిత ..**



మైదుకూరు, (స్ఫూర్తి పత్రిక): మార్చి 06 : ఎఫ్ ఎస్ ఎస్ ఏ ఐ ఆధ్వర్యంలో మైదుకూరు పట్టణములోని కిరాణా మార్చంట్ అసోసియేషన్ భవనం లో పట్టణ పరిధి లోని కిరాణా దుకాణములు హోటల్ బేకరీ షాప్ ల యజమానులతో అవగాహనా సధస్సు నిర్వహించడం జరిగినది.ఈ సధస్సు లో ఫుడ్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ కలర్స్ కలిగిన ఆహార పదార్థాలు కల్తీ నూనెలు టెస్టింగ్ సాల్ట్ బెల్లం బతాని పీచు మిఠాయిలు సాల్టు విషపూరిత రసాయనాలు కలిగిన వస్తువులను విక్రయించకూడదని అలా విక్రయిస్తే షాపుల పై తనిఖీలు చేసికేసులు పెడతామని తెలపడం జరిగింది. అలా ఏవైనా సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్,9440379755 08645 2410295 నెంబర్ లకు పిర్యాదు చేయవచ్చు అని తెలిపారు.ఈ సందర్భంగా కిరాణా మర్చంట్ అసోసియేషన్ వారు ఫుడ్ ఇన్స్పెక్టర్ హరిత డిప్యూటీ తాసిల్దారు చంద్రావతి ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమం లో ఫుడ్ ఇన్స్పెక్టర్ హరిత డిప్యూటీ తాసిల్దారుచంద్రావతి కిరాణా మర్చంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దొంతు సుబ్రహ్మణ్యం మాజీ అధ్యక్షులు నేతి రెడ్డయ్య సభ్యులు పాల్గొన్నారు...

# గుత్తి డివైఈఓ గా లక్ష్మన్న కి శుభాకాంక్షలు తెలిపిన హెచ్‌ఎంల డివిజన్ అధ్యక్షుడు సుంకన్న మరియు బాలికల పాఠశాల ఉపాధ్యాయులు.



గుత్తి(స్ఫూర్తి పత్రిక):గుత్తి డివైఈఓ గా లక్ష్మన్న శుక్రవారం పట్టణము లోని డివైఈఓ కార్యాలయం నందు బాధ్యతలు చేపట్టాడు. కానీ ప్రస్తుతం ఈయన కనేకల్ ఎంఈఓ గా ఉంటూ గుత్తి ఇంచార్జ్ డివైఈఓ గా బాధ్యతలు చేపట్టారు.ముందుగా వీరికి గుత్తి ఎంఈఓ రవి నాయక్ మరియు హెచ్‌ఎంల డివిజన్ అధ్యక్షుడు సుంకన్న మరియు బాలికల పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు స్వాగతం పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గుత్తి డివిజన్ పరిధిలో విద్యా రంగ అభివృద్ధి కి కృషి చేస్తానన్నారు.

# గుత్తిలో 14న జాతీయ లోక్ అదాలత్



గుత్తి(స్ఫూర్తి పత్రిక): గుత్తిలో 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఏ డి జె సాదుబాబు, సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ్ చారి, జూనియర్ సివిల్ జడ్జి మంజుల తెలిపారు. శుక్రవారం ఏడీజే కోర్టులో బార్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు.రాజీకి అవకాశం ఉన్న కేసులను ఈ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. న్యాయవాదులు, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# గుత్తి నూతన సబ్ రిజిస్ట్రార్ గా వినిత బాధ్యతల స్వీకరణ.



గుత్తి(స్ఫూర్తి పత్రిక):: గుత్తి నూతన సబ్ రిజిస్ట్రార్ గా వినిత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ముందుగా కార్యాలయ సిబ్బంది ఆమెకు ఘనస్వాగతం పలికారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం వినిత మాట్లాడుతూ..రిజిస్ట్రేషన్లన్నీ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పారదర్శకగా జరుగుతాయని స్పష్టం చేశారు. ప్రజలు దళారులను నమ్మి మోసపోవద్దని, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. అనంతరం నెలరోజుల పాటు శిక్షణా కార్యక్రమానికి వెళ్లనున్నట్లు తెలిపారు.

# మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయండి

**ఆర్ డి ఓ కేశవ నాయుడు**





(స్ఫూర్తి పత్రిక): మార్చి 06 : శింగనమల : శింగనమల నియోజకవర్గం బుక్కరాయ సముద్రం మండలం లో నియోజకవర్గం వ్యాప్తంగా నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆర్డీవో కేశవ నాయుడు సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం ఉదయం బుక్కరాయ సముద్రం మండల కేంద్రం లోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు శింగనమల నియోజకవర్గం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నియోజకవర్గంలోని మహిళలందరూ 8 న ఆదివారం ఉదయం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో నీ శిద్ద రాంపురం వెళ్లే దారిలో ఉన్న ఆర్డిటి పాఠశాల ఆడిటోరియం నందు మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రజా ప్రతినిధులు , మహిళలు, సర్పంచులు వార్డ్ మెంబర్లు ఎంపీపీలు రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు అన్ని శాఖల అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బుక్కరాయసముద్రం ఎంపీడీవో సాల్మాన్ రాజు తాహసిల్దార్ శ్రీధర్ మూర్తి ఉపాధి హా మీ ఏపీఓ సుజాత ,వ్యవసాయ శాఖ, విద్యాశాఖ,హౌసింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పంచాయతీ ప్రాంగణంలో కార్యక్రమం...

# సర్పంచ్‌కు సమాచారం లేదా?

- పంచాయతీ ప్రాంగణంలో కార్యక్రమం... సమాచారం ఎవరికి?
- ఫ్లెక్సీ లేకుండా నిర్వహణపై ప్రశ్నలు
- ఇంతమంది అధికారులు హాజరైనా ముందస్తు సమాచారం ఎలా చేరలేదు?
- అధికారులు--మీడియా మధ్య పెరుగుతున్న దూరంపై చర్చ



దేవనకొండ, మార్చి 6 (స్ఫూర్తి పత్రిక): కర్నూలు జిల్లా దేవనకొండ మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణంలో బాల్యవివాహాల నిరోధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.పంచాయతీ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కనిపించకపోవడం గ్రామంలో గుసగుసలకు దారితీసింది. సర్పంచ్‌కు సమాచారం అందలేదా? లేక ఇతర కారణాల వల్ల హాజరు కాలేదా? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.ఇంకా కార్యక్రమం జరిగిన ప్రదేశంలో ఫ్లెక్సీ లేదా కార్యక్రమానికి సంబంధించిన వివరాలు కనిపించకపోవడం కూడా చర్చకు కారణమైంది. సాధారణంగా ప్రభుత్వ కార్యక్రమాలకు ముందస్తు ఏర్పాట్లు, ప్రచారం ఉంటుందని గ్రామస్థులు చెబుతున్నారు. అయితే ఈ కార్యక్రమం అలాంటి ఏర్పాట్లు లేకుండానే నిర్వహించబడిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం పెళ్లి సీజన్ కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలపై అప్రమత్తత అవసరమని అధికారులు చెబుతున్నప్పటికీ, అవగాహన కార్యక్రమాలు కేవలం సమావేశాలకే పరిమితమవుతున్నాయా అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. బాల్యవివాహాలను అరికట్టేందుకు మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు.ఇక మరోవైపు దేవనకొండ మండలంలో జరుగుతున్న కొన్ని ప్రభుత్వ కార్యక్రమాల గురించి స్థానిక పత్రికా విలేకరులకు ముందస్తు సమాచారం అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాలు మీడియా ద్వారా ప్రజలకు చేరితే అవగాహన మరింత పెరుగుతుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులతో మీడియా మధ్య సమన్వయం అవసరమని పలువురు సూచిస్తున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఐసీడీఎస్ సూపర్వైజర్లు, మండల వైద్యాధికారులు డాక్టర్ విజయభాస్కర్, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ఎంపీడీవో జ్యోతి, తహసీల్దార్ సుదర్శనం, దేవనకొండ సీఐ వేణుగోపాల్, ఏపీఎం లక్ష్మమ్మ, మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మల్లేపల్లి రంగడు, సొసైటీ చైర్మన్ రాజశేఖర్ గౌడ్, మల్లికార్జున గౌడ్, దేవనకొండ మాజీ ఎంపీటీసీ ఆకుల వీరేష్, నాగరాజు గౌడ్, కాకర్ల శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని ఐసీడీఎస్ అధికారులు, అంగన్వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు హాజరయ్యారు.

# ఆశా వర్కర్లకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలి

- ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్
- ఉద్యోగ భద్రతతో పాటు పలు సదుపాయాలు కల్పించాలంటూ సమావేశం




దేవనకొండ, మార్చి 06 (స్ఫూర్తి పత్రిక): ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఏఐటీయూసీ అనుబంధ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. రమీజాబి డిమాండ్ చేశారు. దేవనకొండలో శుక్రవారం ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.ఈ సమావేశానికి యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు రాధిక అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు ఆరోగ్య రంగంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ వారికి తగిన గుర్తింపు, భద్రత లభించడం లేదన్నారు. అందువల్ల ఆశా కార్యకర్తలను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి పర్మనెంట్ చేయాలని ఆమె కోరారు.అంతవరకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని, మెడికల్ ఉద్యోగులకు లభించే సౌకర్యాలు ఆశా కార్యకర్తలకు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రోజుకు ఎనిమిది గంటల పని విధానం అమలు చేయడంతో పాటు సాధారణ సెలవులు, వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు కల్పించాలని కోరారు.అలాగే ఆశా కార్యకర్తలకు అవసరమైన రికార్డులు, నాణ్యమైన యూనిఫాంలు సరఫరా చేయాలని, డీఎంహెచ్ఓ సంతకంతో గుర్తింపు కార్డులు ఇవ్వాలని సూచించారు. యాప్‌లలో సమాచారాన్ని నమోదు చేయడానికి తగిన సాంకేతిక సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ఖాళీగా ఉన్న ఆశా పోస్టులను భర్తీ చేసి పని భారం తగ్గించాలని, ఏఎన్ఎం లేదా జీఎన్ఎం పూర్తి చేసిన ఆశా కార్యకర్తలకు పదోన్నతులు కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. అలాగే రిటైర్మెంట్ వయసును 60 నుండి 62 సంవత్సరాలకు పెంచి, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌గా రూ.5 లక్షలు మరియు నెలకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు.డ్యూటీలో ఉన్నప్పుడు ఆశా కార్యకర్తలు మరణిస్తే రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని వారు కోరారు. అలాగే ప్రమాద బీమా, గ్రూప్ ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఆశా కార్యకర్తలకు సంబంధించిన సమస్యలు త్వరితగతిన పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతామని వారు హెచ్చరించారు.ఈ సమావేశంలో ఆశా యూనియన్ నాయకులు తులసమ్మ, నాగలక్ష్మి, రాధ, అరుణ, సువర్ణ, హైమావతి, సుజాత, కృష్ణవేణి, విజయలక్ష్మి, రాజమ్మ, కాంతమ్మ, జైనబీ, లక్ష్మీ ప్రసన్న, అనసూయ, సరోజ, జ్యోతి, మీనా, వరలక్ష్మి, రామక్క, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు 'గుడ్ టచ్ - బ్యాడ్ టచ్'పై అవగాహన

**- జాగ్రత్తలు పాటించాలంటూ పోలీసుల సూచనలు**

**- దేవనకొండ ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు**



దేవనకొండ, మార్చి 06 (స్ఫూర్తి పత్రిక): చిన్నారులపై జరుగుతున్న దాడులు, లైంగిక వేధింపుల నుంచి ఎలా రక్షించుకోవాలో తెలియజేస్తూ దేవనకొండ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దేవనకొండ ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఐ వేణుగోపాల్ చిన్నారులకు 'గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్' గురించి వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరి ప్రవర్తన అనుమానాస్పదంగా అనిపించినా వెంటనే తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. తమకు అసౌకర్యంగా అనిపించే స్పర్శలను గుర్తించటం, అలాంటి పరిస్థితుల్లో ధైర్యంగా స్పందించడం ఎంతో ముఖ్యమని చెప్పారు.పిల్లల భద్రత కోసం జాగ్రత్తలు పాటించడం అవసరమని, సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా పెద్దలకు తెలియజేయాలని సీఐ సూచించారు.ఈ కార్యక్రమంలో దేవనకొండ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, శివుడు, ఇతర పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## తపోవనం సర్కిల్ లోని ఎన్ హెచ్

# హైవే నందు ట్రావెల్స్ నిర్వాహకుల నయా దందా







- ప్రజల ప్రాణాలంటే లెక్కలేని తనం.
- హైవే నిర్వాహకులకు డబ్బులు ఇచ్చి పర్మిషన్ తీసుకున్నామంటూ నయా మోసం.
- మీ వల్ల మాకు ఇబ్బంది అన్న ప్రజలను దౌర్జన్యాలకు దిగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్న ట్రావెల్స్ నిర్వాహకులు.
- కళ్ళు ఉండి చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న ఎన్ హెచ్ హైవే అధికారులు.

అనంతపురం అర్బన్ (స్ఫూర్తి పత్రిక): మార్చి 06 : : అనంతపురం: ఎన్.హెచ్.ఐ.వే నిర్వాహకులు హైవే యొక్క శుభ్రత మరియు వాహనాల యొక్క ఇబ్బందులను వారి పరిధిలోకి తీసుకొని ఇబ్బంది కలిగినప్పుడు కావలసినటువంటి సదుపాయాలను కల్పించడంతోపాటు,ఎమర్జెన్సీ సమయం లో వారికి అందుబాటులో ఉండి వారి ప్రయాణానికి కావలసినటువంటి ప్రాథమిక విధులను నిర్వర్తించడంతోపాటు హైవేలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవడం వారి యొక్క విధి. ఇందుకు విరుద్ధంగా అనంతపురం పట్టణం తప్పవనం సర్కిల్లోని నేషనల్ హైవే లో వీరి యొక్క పనితీరు ఏ విధంగా ఉన్నది అన్నది ఒక తాత్కానంగా నిలుస్తున్నది. అనంతపురం పట్టణంలోని తపురం సర్కిల్ జనావాసాలకు నిలయమే కాకుండా అత్యంత రద్దీప్ ప్రాంతమైనటువంటి ఒక ముఖ్యమైన కూడలి అని చెప్పాలి. అలాంటి ప్రాంతంలోని హైవేలో ట్రావెల్స్ నిర్వాహకులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇదే సంఘటన పైన పత్రికలో అనేక కథనాలు విలువబడినప్పటికీ ఇటు పోలీసు అధికారులు, అటు హైవే అధికారులు తాత్కాలికంగా చర్యలు తీసుకున్నదే తప్ప పూర్తి పరిష్కార దిశగా ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేదు. ప్రస్తుతం నేటికీ కూడా ఇదే సర్కిల్లో ఇష్టానుసారంగా వాహనాలను నిలుపుదల చేసి ఇటు ప్రజలకు, అటు వాహనదారులకు ఇబ్బందికరంగా మారుతున్నారు. ఈ విధంగా చేయడం తప్పు అని చెప్పి స్థానిక ప్రజలు గాని, ఎవరైనా ప్రశ్నించినట్లయితే వారినీ దుర్భాషలు ఆడడమే కాకుండా దాడులకు సైతం దిగడం సర్వసాధారణంగా మారింది. ఎవరైనా వారిని ప్రశ్నిస్తే మేము ఎన్ హెచ్ హైవే అధికారులకు డబ్బులు ఇచ్చి పర్మిషన్ తీసుకున్నామని చెప్పడం గమనార్హం.ఎన్ హెచ్ హైవే పరిధిలో ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడవలసిన బాధ్యత మాత్రమే హైవే అధికారులకు ఉంటాది తప్ప ఇష్టానుసారంగా వ్యవహరించడానికి ట్రావెల్స్ వివాహకులకు పర్మిషన్ ఇవ్వడానికి ఈ విధంగా సంబంధం కలిగి ఉన్నది అన్నది ఇక్కడ కొసమెరుపు. కనుక ఇప్పటికైనా హైవే అధికారులు ట్రావెల్స్ నిర్వాహకులతో డబ్బులు తీసుకొని హైవేకు ఇష్టానుసారంగా వ్యవహరించడానికి వారికి పర్మిషన్ ఇచ్చారా లేక జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఇందులో మాకు ఏమి సంబంధం అన్న విధంగా వ్యవహరిస్తున్నారా అన్నది మిలియన్ డాలర్ల ప్రస్తగా మిగిలి ఉంది. కనుక ఇప్పటికైనా ఇటు ఎన్ హెచ్ హైవే అధికారులు అటు పోలీసు ఉన్నత అధికారులు వీటిపైన దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

